క్లుప్తంగా

రేపు విద్యుత్ అదాలత్

ఆత్మకూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ లోక్ అదాలత్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు డీఈఈ బీ జనార్దన్ శనివారం తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి 1.30 గంట వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని చెప్పారు. ఏపీఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు కే రామ్మోహన్‌రావు, ఎస్‌ఎల్ అంజినీకుమార్, జీ ఈశ్వరమ్మ హాజరవుతారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లిలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల మదమాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 125 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన వైద్యశిబిరంలో సాఫ్ట్‌వేర్ అల్లంపాటి వెంకటరాజేష్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు షంషాద్, మాధురి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన



ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు కేన్సర్ వ్యాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ఠాగూర్ మాట్లాడుతూ కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్లు అధికంగా వస్తాయని తెలిపారు. కేన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తే పాటించాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. వైద్యులు ఝాన్సీరాణి, అనీస్‌సల్మా, తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపాడులో గ్రామసభ

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడులో ఇన్‌చార్జి తహసీల్దార్ పీ విజయ్ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ విడత భూపంపిణీకి సంబంధించి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూమి లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆర్‌ఐ కే సుమతి, సర్పంచ్‌లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్రాంతి పోటీలు



దుత్తలూరు: స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శనివారం సంక్రాంతి పోటీలు నిర్వహించారు. ప్రొడక్షన్ ఆపరేటర్లు, ఫ్యాషన్ డిజైనింగ్ ట్రైనీలకు మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నర్రవాడ వెంగమాంబ ఆలయ ఈఓ ఉషశ్రీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం వెంగమాంబ దేవస్థానం క్యాలెండర్లను పంపిణీ చేశారు. దేవస్థాన సిబ్బంది మహాలక్ష్మి, సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆర్జేడీ తనిఖీలు



కలిగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆర్జేడీ సుబ్బారావు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులను ప్రశ్నలు అడిగి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో జంప్‌రోప్ (స్కిప్పింగ్) పోటీల్లో రజత పతాకం సాధించిన క్రీడాకారిణి చిట్టేటి సుష్మను అభినందించి ప్రోత్సాహకంగా రూ.7వేలు నగదు అందజేశారు. జీసీడీఓ మమత, ప్రిన్సిపల్ సుప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేర్నాటిని ఆశీర్వదించాలి



ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పట్టణంలోని ఎంజీఆర్ కార్యాలయంలో ఎన్నికల ప్రచార కరపత్రాలను శనివారం వారు ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, సొసైటీ అధ్యక్షుడు ఎన్ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, ఎం రాజశేఖర్, మహబూబ్‌బాషా, పీ పెంచలయ్య, నాయకులు సయ్యద్ జమీర్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, శీనయ్య, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రథయాత్రలో భక్తుల కోలాట ప్రదర్శన

వైభవంగా రథయాత్ర



గౌర-నితాయ్ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



దైవ సందేశం ఇస్తున్న ఇస్కాన్ గురువులు

కావలి రూరల్: పట్టణంలోని ట్రంకు రోడ్డులో శ్రీ గౌర-నితాయ్ రథయాత్రను శనివారం వైభవంగా నిర్వహించారు. రామ్మూర్తిపేటలోని ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర బృందావన కాలనీ నుంచి ప్రారంభమై ఐదు లాంతర్ల సెంటర్, కృష్ణుడు బొమ్మ సెంటర్, శివాలయం వీధి మీదుగా సాగింది. రథయాత్రలో రంగవల్లులు, కోలాట, భజన బృందాలు, వివిధ వేషాధారణలు, కీలు గుర్రాలాటల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత ఇస్కాన్ గురువులు భక్తులకు దైవ సందేశాన్ని అందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ

ఉదయగిరి: యువత క్రీడల్లో రాణించాలని ఉదయగిరి సీఐ వీ గిరిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణంపల్లిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. క్రీడలతో స్నేహభావాన్ని పెంచుకోవచ్చన్నారు. సంక్రాంతి సందర్భంగా కృష్ణంపల్లి యువత క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శివరామిరెడ్డి, ఉపాధ్యాయుడు డీ రమేష్ మాజీ సర్పంచ్ ఆవుల రత్నయ్య, యూత్ సభ్యులు జీ ప్రసాద్, ఆర్ వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీఎస్‌యూ అథ్లెటిక్ శిక్షణ



క్రీడాకారులకు షూ, జెర్సీలు అందజేస్తున్న పీడీ

కావలి : పట్టణంలోని జవహర్‌భారతి కళాశాల క్రీడా మైదానంలో విక్రమ సింహపురి వర్సిటీ అథ్లెట్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి తమిళనాడులో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనున్న వర్సిటీ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వర్సిటీ వీసీ సుందరవల్లి క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని చెప్పారు. కోచ్‌లు మణికంఠ, ప్రవీణ్, మేనేజర్ కృష్ణమూర్తి పర్యవేక్షణలో క్రీడాకారులు బాగా సాధన చేశారని తెలిపారు. శిక్షణ పొందిన క్రీడాకారులు అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్‌లో సత్తా చాటి వర్సిటీకి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు వర్సిటీ తరుపున ట్రాక్ షూ, జెర్సీలు అందజేశారు.

చెన్నకేశవస్వామి గ్రామోత్సవం

అనుమసముద్రంపేట: మండలంలోని చిన్నబ్బీపురంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత చెన్నకేశవస్వామి మూలవిరాట్టుకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

సంగం: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకు మధుసూదన్‌యాదవ్ నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అరటిబోదెలతో ప్రత్యేకంగా తయారు చేసిన మండపంలో అయ్యప్ప స్వామిని కొలువుదీర్చి భజనలు చేశారు. అనంతరం 18 మెట్లపై కర్పూరం వెలిగించి మెట్ల పూజ నిర్వహించారు.

నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

ఉదయగిరి: మండలంలో చేపట్టిన ఉపాధి పనులను నిష్పక్షపాతంగా తనిఖీ చేసి లోపాలను వెలికితీయాలని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్ సామాజిక తనిఖీ ఆడిట్ బృంద సభ్యులకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధి సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను ఆడిట్ బృందానికి అందజేసి త్వరితగతిన తనిఖీలు పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 46.92 ఎకరాల్లో 32 జగనన్న కాలనీ లేఅవుట్లను రూ.2.52 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. లేఅవుట్లు, సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు కొలతలు సేకరించాలన్నారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏపీఓ శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్వీ సుబ్బారావు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోవర్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ



సోమశిల: మాట్లాడుతున్న ఎంఈఓ బాలకృష్ణారెడ్డి



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

సోమశిల: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని అనంతసాగరం ఎంఈఓ బాలకృష్ణారెడ్డి హెచ్‌ఎంలకు సూచించారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రధానోపాధ్యాయులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో కలిసి పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మార్పీ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి ఈ నెల 8,9 తేదీల్లో జరిగే గ్రామసభల్లో ఆమోదింపజేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. స్థానిక ఉన్నత ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లో పాఠశాలల అభివృద్ధి, ఆవాస ప్రాంతాల ప్రణాళికల తయారీపై శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించి సకాలంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్లు గౌస్‌బాషా, అరాఫత్,కార్యదర్శి నస్రుల్లా, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్, అరుంధతీయవాడ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డితో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారని వివరించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రజాసమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సచివాలయం పరిధిలోని మూడు వార్డుల్లో గుర్తించిన సమస్యలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్లు పీ తిరుపతమ్మ, పొడమేకల పెంచలయ్య, షేక్ మహబూబ్‌బాషా, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని దర్వేషావలి దర్గాలో గంధ మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పార్థనలు నిర్వహించి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. గంధోత్సవ నిర్వాహకుడు ముర్తుజాహుస్సేన్, మతపెద్దలు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



చేజర్ల: మండలంలోని ఏటూరులో జగనన్న భూహక్కు–భూరక్ష పథకం కింద చేపడుతున్న భూముల రీసర్వేను జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే) ఏహెచ్ హనుమాన్‌ప్రసాద్ శనివారం పరిశీలించారు. రీసర్వే సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. రైతులకు న్యాయం జరిగేలా రీసర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. డీఐఎస్ నరసింహమూర్తి, తహసీల్దార్ పీ విజయ్, రీసర్వే డీటీ ఎం గిరీష్, సర్వేయర్ శ్రీలత, ఆర్‌ఐ కే సుమతి, వీఆర్వో పెంచలయ్య, సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ



అల్లూరు: గ్రామస్తులు ఐకమత్యంగా ఉంటే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ షేక్ కరిముల్లాషాఖాదర్ పేర్కొన్నారు. నార్త్‌ఆములూరులో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామాభివృద్ధి ప్రణాళికలను చదివి వినిపించారు. ఈఓపీఆర్డీ వీరేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

సోమశిల: సోమశిల జలాశయం లోతట్టు ప్రాంతంలో కొన్నినెలల క్రితం జాలరి మృతి విషయం వెలుగులోకి రావడంతో అనుమానితుడిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. సోమశిల జలాశయం లోతట్టు వైఎస్సార్ జిల్లా కొత్తూరు ప్రాంతంలో చేపలు పట్టేందుకు ఐదునెలల క్రితం రాజమండ్రి నుంచి సురేష్ అనే వ్యక్తి వచ్చాడు. అతడికి సోమశిలకు చెందిన ఓ వ్యక్తికి ఘర్షణ జరిగింది. సురేష్ గాయపడి మృతి చెందాడు. ఈ విషయం బయటకు రాకుండా సురేష్ మృతదేహాన్ని సదరు వ్యక్తి కాల్చివేసినట్లు శుక్రవారం నుంచి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అనుమానితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనా స్థలం వైఎస్సార్ జిల్లా పరిధి కావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



కావలి రూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కావలి తహసీల్దార్ మాధవరెడ్డి అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగ చిన్నారులకు వికలత్వ పరీక్షలు నిర్వహించి ఉపకరణాలు అందజేశారు. ఎంఈఓ శ్రీధర్, ప్రిన్సిపల్ నీరజ, వైద్యులు ఝాన్సీ, స్వర్ణలత, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ధనమ్మ, ఐఈఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం కొత్తపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ మధుసూదన్ శనివారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రమణరావుకు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంసీఓ ప్రసాద్, చంద్రమౌళి, సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు



ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న సెబ్ అధికారులు

ఆత్మకూరు: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఆత్మకూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ బీ నయనతార సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సమాజం చిన్నచూపు చూస్తుందన్నారు. రాష్ట్రాన్ని మాదవ ద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా సెబ్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఏ కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు బీఎస్వీ రమణారెడ్డి, బీ రాములు, పాల్గొన్నారు.



అల్లూరు: సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరహరిరావు

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో కోవూరు ఇన్‌చార్జి సెబ్ ఇన్‌స్పెక్టర్ నరహరిరావు ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసులకు మాదక ద్రవ్యాల నిరోధంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే సెబ్ అధికారులు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందజేయాలని కోరారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టంపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. సెబ్ ఎస్సై టీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్, మస్తానయ్య, తులసి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే రాజ్యాంగ చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ అన్నారు. పట్టణంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. నిజాయతీ కలిగిన జీవన విధానాన్ని అలవర్చుకుని ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలన్నారు. లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు ఎం వెంకటేశ్వర్లు, ఎల్వీ రమణయ్య, ఎన్ ఓబులేసు, ఎస్సై ఎం శివశంకరరావు, కళాశాల ప్రిన్సిపల్ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసులు

కావలి రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా బెంగళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం కావలి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. గతంలో సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులను 50శాతం అదనపు చార్జీలతో నడిపేవారమని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారాకా తిరుమలరావు ఆదేశాల మేరకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని వివరించారు. ప్రయాణ చార్జీల్లో ప్రత్యేక రాయితీలను కూడా కల్పిస్తున్నామన్నారు. రానుపోను ఒకేసారి ముందుగా రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం, వృద్ధులకు 25శాతం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కావలికి, 15 నుంచి 18వ తేదీ వరకు తిరిగి హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని వివరించారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హోరాహోరీగా జగనన్న క్రికెట్ పోటీలు



పోటాపోటీగా తలపడుతున్న క్రీడాకారులు

కావలి : పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. శుక్రవారం జరిగిన రెండో రౌండ్ పోటీల్లో తొలి మ్యాచ్‌లో క్రిక్ ఐటీ లెవెన్స్ జట్టుపై ప్రవీణ్ లెవెన్స్ జట్టు 78 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. 34 బంతుల్లో 78 పరుగులు, 3 వికెట్లు సాధించిన శివప్రతీష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. రెండో మ్యాచ్‌లో ఎంసీసీ లెవెన్స్‌పై ఎస్వీ లెవెన్స్ జట్టు విజయం సాధించింది. హరిమనోహర్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను అందుకున్నాడు. మూడో మ్యాచ్‌లో నైట్‌లెవన్స్‌పై లెవన్‌బుల్స్ జట్టు విజయం సాధించింది. 4 వికెట్లు తీసిన పాండుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పోలేరమ్మ ఉత్సవ బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



పోలేరమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ రాజేష్

అల్లూరు: ఈ నెల 10న జరగనున్న అల్లూరుపేట పోలేరమ్మ ఉత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను కావలి రూరల్ సీఐ రాజేష్ శనివారం పరిశీలించారు. పోలేరమ్మ ఆలయ పరిసర ప్రాంతాలు, గ్రామోత్సవం సాగే వీధులను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవం సజావుగా సాగేలా బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐ వెంట అల్లూరు ఎస్సై శ్రీనివాసులరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ విద్యారంగ బలోపేతమే లక్ష్యం



బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న డీ శ్రీనివాస్

ఉదయగిరి: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే డెమొక్రటిక్ పీఆర్టీయూ ప్రధాన లక్ష్యమని ఆ సంఘ వ్యవస్థాపక రాష్ట్రాధ్యక్షుడు డీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలపాల నీలిమాదేవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో డెమొక్రటిక్ పీఆర్టీయు ఆధ్వర్యంలో పదవ తరగతి మాదిరి ప్రశ్న, జవాబు పత్రాల బుక్‌లెట్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులతో తయారుచేయించిన బుక్‌లెట్లను ఉపాధ్యాయులకు అందజేస్తున్నామని తెలిపారు. నూరు శాతం ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. గుంటూరు, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు జ్ఞానేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చోటా శ్రీనివాసులు, హెచ్‌ఎం గౌస్‌బాషా,ఉపాధ్యాయులు షరీఫ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ్ల క్షేత్రం అభివృద్ధికి కృషి



వింజమూరు: నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అబివృద్ధికి కృషి చేస్తామని ఐఎఫ్ఎస్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ్ల క్షేత్రాన్ని శనివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, టీటీడీ సంయుక్తంగా హైందవ దేవాలయాల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నాయన్నారు. అందులో భాగంగా నల్లగొండ్ల దేవస్థానంలో కోనేరు, గోవిందరాజస్వామి దేవస్థానం, డార్మెంటరీ, టూరిజం గెస్ట్‌హౌస్, సెంట్రల్ లైటింగ్, వంటశాల, ఫెన్సింగ్, పురోహితులకు వంటశాల, తదితర నిర్మాణాలకు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు అందాయన్నారు. వాటిని మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఈఓ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకినపల్లి శివశంకర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

18న సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.